ఆవేదనే మిగిలింది!

- రోడ్లను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- అర్ధంతరంగా నిలిచిన చీపురుపల్లి–నువ్వలరేవు రహదారి
- ధూళి రేగుతున్న పూండి–మంచినీళ్లపేట రోడ్డు



రాళ్లు తేలిన పూండి–మంచినీళ్లపేట రోడ్డు

వజ్రపుకొత్తూరు: ఎన్నికలకు ముందు అంతా.. ఇంతా.. అన్నారు. ఎన్నికల తరువాత ఏమీ లేకుండా చేశారు. పల్లె పండుగ అని చెప్పుకున్న కూటమి నాయకులు ప్రగతిదారులను పక్కన పెట్టేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో అభివృద్ధిని గాలికొదిలేశారు. తాము అధికారంలోకి వస్తే రోడ్ల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని చెప్పిన నాయకులు.. ఆ తరువాత నిర్మాణంలో ఉన్న రహదారులకు అవసరమైన నిధులను మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. పలాస నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రూ.35 కోట్లతో మంజూరైన కాశీబుగ్గ వయా అక్కుపల్లి మీదుగా వజ్రపుకొత్తూరు రహదారి, పూండి నుంచి మంచినీళ్లపేట వరకు రూ.1.10 కోట్లుతో మరమ్మతులు, రూ.25 కోట్లతో పనులు ప్రారంభించిన చీపురుపల్లి–నువ్వలరేవు రహదారులను కూటమి సర్కారు గాలికొదిలేసింది. కాంట్రాక్టర్‌కు కోట్లాది రూపాయల నిధులు పెండింగ్‌లో ఉంచి చెల్లించలేమంటూ చేతులెత్తేయడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

అభివృద్ధి.. అయోమయం:

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.1.10 కోట్లను పూండి మంచినీళ్లపేట రహదారికి సీఎంవో గ్రాంటు కింద మంజూరు చేశారు. కూటమి సర్కారు ప్రారంభంలోనే రహదారి పనులు చేపట్టి హడావిడి చేశారు. ఉన్న రోడ్డుని తవ్వి వెట్ మిక్స్ వేశారు. ప్రస్తుతం ఆ గ్రాంటులో నిధులు లేవంటూ ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఆ రోడ్డుపై వేసిన క్రషర్ స్టోన్ డస్ట్ ధూళి.. దుమ్మూ రేపుతోంది. రూ. 25 కోట్ల సీఆర్ఎఫ్ నిధులతో చీపురుపల్లి నుంచి నువ్వలరేవు వరకు నిర్మించాల్సిన రోడ్డును 50 శాతం మేర పనులు పూర్తి చేశారు. దాదాపు రూ.15 కోట్ల మేర సంబంధిత కాంట్రాక్టర్ ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.3 కోట్లు వరకు బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం బెండిగేటు నుచి నువ్వలరేవు వరకు ఈ రహదారిపై గోతులు, పాడైన కల్వర్టులతో ప్రమాదాలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కాశీబుగ్గ వయా అక్కుపల్లి మీదుగా వజ్రపుకొత్తూరు వరకు గత ప్రభుత్వంలో ఎన్‌డీబీ నిధులు రూ.35 కోట్లు మంజూరు చేయగా ఒక లేయర్‌తో పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులను కూటమి సర్కార్ పూర్తి చేయలేదు సరికదా బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఈ రోడ్డు కోసం కాంట్రాక్టర్‌లు రూ.40 కోట్లు వరకు పెట్టుబడి పెట్టి పనులు చేశారు. బిల్లులు మంజూరు కాక అయోమయంలో ఉన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌లు ప్రభుత్వ పెద్దలను అమరావతిలో కలిసి చర్చించినప్పటికీ సీఎంవో, సీఆర్ఎఫ్, ఎన్‌డీబీ నిధులు మంజూరు చేయలేమని ప్రభుత్వం చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. రోడ్ల పనులను అర్థాంతరంగా వదిలేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్లపై వెళితే వాహనాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బెండిగేటు–నువ్వలరేవు మధ్య శిథిలమైన రహదారి



పూండి వైఎస్సార్ జంక్షన్ వద్ద బస్సు వెనుక రేగుతున్న ధూళి

అనారోగ్యం బారిన పడుతున్నాం



పూండి–మంచినీళ్లపేట రోడ్డులో వైఎస్సార్ జంక్షన్ నుంచి పీఎంపురం వరకు వెళ్లే దారిలో ధూళి, దుమ్ము రేగుతోంది. షాపులు, ఇళ్లల్లోకి ధూళి వస్తుండడంతో ఉండలేకపోతున్నాం. ధూళి కారణంగా ఇళ్లలో అద్దెకు కూడా ఎవరూ దిగడం లేదు. ఎనిమిది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాం. రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– కె.రమేష్, వర్తకుడు, పూండి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

ప్రధాన రహదారుల నిర్మాణం మధ్యలో ఆగిపోవడం వాస్తవమే. నిధులు మంజూరు చేయాలని, గ్రాంట్లు మళ్లీ కేటాయించాలని తమ ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వాన్ని కోరాం. కాంట్రాక్టర్లకు పెద్దమొత్తంలోనే బిల్లు చెల్లించాల్సి ఉంది. నిధులు మంజూరు కాగానే అన్ని రోడ్డు పనులు పూర్తి చేస్తాం.

– డి. విక్రమ్, ఆర్అండ్‌బీ ఏఈఈ, పలాస

క్లుప్తంగా

సత్యరాజు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు



సత్యరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట సర్పంచ్ వంక సత్యరాజు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మంచినీళ్లపేటలో ఆదివారం జరిగిన సత్యరాజు సంతాప సభలో ఆయన మాట్లాడారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుసూదనరావు, వైస్ ఎంపీపీ వంక రాజు, మందస ఎంపీపీ డొక్కరి, దానయ్య, పలాస మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, వంక లక్ష్మయ్య పాల్గొన్నారు.

హిజ్రాల నిరసన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న హిజ్రాలు

టెక్కలి రూరల్: అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ దీపు హత్యకు కారణకులైన వారిని ఉరితీయాలని హిజ్రాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు టెక్కలిలోని ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద కాశీవిశ్వేశ్వర సేవాసంఘం ట్రాన్స్‌జండర్ల అధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. దీపు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఇందిరాగాంధీ జంక్షన్ నుండి అంబేడ్కర్ కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ట్రాన్స్ జండర్ల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్, సోనా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న అమ్మవారు

సోంపేట: సోంపేట గ్రామ దేవత నింభాషిణి అమ్మవారి దేవాలయ వార్షికోత్సవం ఆదివారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చివరి రోజున పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు జరిగాయి. సోంపేట పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భోపాల్‌లో కళాకారుల ప్రతిభ



భోపాల్‌లో చెక్కభజన కళాకారులు

పలాస: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఇందిరాగాంధీ మానవ సంగ్రాహాలయంలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన ఉత్తరాంధ్ర జానపద కళల ప్రదర్శనలో జిల్లా కళాకారులు అలరించారు. తెలుగుధనం కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రాచీన జానపద కళలు, గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఇందులో పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఆధ్వర్యంలో విజయనగరం, శ్రీకాకుళం ప్రాచీన చెక్క భజన కళారూపాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు .

రైతు ఉత్పత్తిదారుల కలెక్షన్ సెంటర్ పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ కిరణ్‌కుమార్

వజ్రపుకొత్తూరు: మహిళా రైతులను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలని సెర్ప్, డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల కలెక్షన్ సెంటర్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెలుగు ఏరియా కోఆర్డినేటర్, ఏపీఎం, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో పండే ఉప్పు, జీడిపిక్కలను మార్కెటింగ్ చేసేందుకు మహిళలను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ప్రతీ జీడి రైతు నుంచి ప్రభుత్వం ప్రకటించిన ధర మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. ఉత్పత్తులు నిల్వ చేసేందుకు చక్కటి అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సోంపేట ఏరియా కోఆర్డినేటర్ సీహెచ్ రామ్మోహన్ రావు, ఏపీఎం జి.ప్రసాదరావు, ఎఫ్‌పీఓ ఏపీఎం ఈశ్వర్ ఉన్నారు.

ఆలయానికి నిధుల కేటాయింపుపై హర్షం



ఎమ్మెల్సీ రామారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండల కేంద్రం కవిటిలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ నర్తు రామారావును కొత్తపుట్టుగలోని తన నివాసంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ నిర్మాణదారుడు పాపయ్యరెడ్డి తదితరులు ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్సీ రామారావుతో కలిసి పలువురు నాయకులు టీడీడీ చైర్మన్‌గా వ్యవహరించిన భూమన కరుణాకర్‌రెడ్డిని గతంలో కలిసి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా ఎండోమెంట్‌డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రూ. ఐదు లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులకల శ్రీరాములు, చందాన పూర్ణ, మొగలిపురి సీతారాం, తెలుకల ప్రేమానంద్‌సాహు, వెంకటరావు ఉన్నారు.

ఉద్యోగాలకు 65 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న డాక్ట్ కె.లీల తదితరులు

వజ్రపుకొత్తూరు: స్థానిక సాయివినీత్ విద్యా సంస్థల్లో ఆదివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. శ్రీసిటీలోని ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలైన కోల్గేట్, డైకిన్, ఫాక్స్‌కాన్, ఎస్ఎస్ ఇన్స్ట్రిమెంట్స్ ఏషియన్ ఆటో పార్ట్స్, టాలెంట్‌వర్క్, బ్లూస్టార్ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. 130 మంది హాజరవ్వగా 65 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని సాయివినీత్ విద్యా సంస్థల అధినేత, మాజీ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీల తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారికి డాక్టర్ లీల, డైరెక్టర్ సీహెచ్ కోదండరావులు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్లు బాలచంద్రన్, మురళి, సౌజన్య, ప్రిన్సిపాల్ ఎ.కైలాశరావు, సాయిగోపాల్, బత్తిని శ్రీనివాసరావు, కె.కోదండరావు, ఎంఎస్‌సీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘన తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

- ఎంపీపీ శ్రీరామమూర్తి



ప్రోటోకాల్ పాటించకుండా శంకుస్థాపన కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

నందిగాం: శాసనమండలి సాక్షిగా ప్రోటోకాల్ పాటిస్తున్నానని గొప్పగా చెప్పిన మంత్రి అచ్చెన్నాయుడు తన నియోజకవర్గంలో ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు చేపట్టనున్న రహదారుల శంకుస్థాపన శిలాఫలకాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధుల పేర్లు లేకుండా ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నారని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పలువురు పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న రోడ్లకు శంకుస్థాపనలు చేసేందుకు ఏర్పాటు చేసిన శిలాఫలకాల్లో కేవలం మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహననాయుడు పేర్లు మాత్రమే వేసి స్థానిక ప్రజా ప్రతినిధుల పేర్లు వేయకపోవడం అచ్చెన్నాయుడు దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. శాసనమండలిలో బొత్స సత్యనారాయణ ప్రోటోకాల్ కోసం అడిగిన ప్రశ్నకు మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు సమాధానం చెబుతూ స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లు కూడా శిలాఫలకాల్లో వేయిస్తున్నామని చెప్పారని గుర్తు చేశారు. అయితే తన స్వంత నియోజకవర్గంలో అహంకారంతో తమ ఇద్దరి పేర్లు మాత్రమే శిలాఫలకాల్లో వేసుకొని స్థానిక ప్రజా ప్రతినిధులను విస్మరించడం ప్రోటోకాల్ ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. అలాగే ఈ పనులు పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతూ ఆ శాఖమంత్రి పవన్ కల్యాణ్ పేరు కూడా శిలాఫలకంలో వాడకుండా ఆయనను కూడా అవమానపరుస్తున్నారని అన్నారు. స్థానిక పంచాయతీరాజ్ అధికారులకు ప్రోటోకాల్ కోసం ప్రశ్నిస్తే మంత్రి చెప్పినట్లు చేస్తున్నామని జవాబు ఇస్తున్నారని అన్నారు. మండలంలో ఆయా పనులు చేయుటకు వీలుగా పంచాయతీల్లో, మండలంలో తీర్మాణాలు చేసిన సర్పంచ్‌లను, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులను విస్మరించడమేనా నీవు పాటించే ప్రజాస్వామ్య విలువా అని ప్రశ్నించారు. అధికారులు పక్షపాత వైఖరి వీడి స్థానిక సంస్థల్లో ప్రజల చేత ఎన్నికకాబడిన ప్రజా ప్రతినిధులకు సముచిత స్థానం కల్పించి గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు, బొమ్మాళి గున్నయ్య, తమిరె రాజు ఉన్నారు.

డిగ్రీ కళాశాలల యూనియన్ వైస్ చైర్మన్‌గా తులసీదాస్



ఇచ్ఛాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యూనియన్ జిల్లా వైస్ చైర్మన్‌గా చాట్ల తులసీదాస్ ఎన్నికయ్యారు. రాష్ట్ర పరిశీలకులు నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళంలో యూనియన్ ఎన్నికలు జరిగాయి. ఇచ్ఛాపురంలోని స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తులసీదాస్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.


ఎస్సీ వర్గీకరణతో ఉపకులాలకు న్యాయం



మహనీయుల విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు

కాశీబుగ్గ: ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగ ఉపకులాలకు తగిన న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాశీబుగ్గలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం తదితరుల విగ్రహాలకు ఆదివారం పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉర్నాన అప్పలరాజు, కోల సింహాచలం, సీహెచ్ నేతాజీ, బి.శివకుమార్, మీల జోగారావు, డి.పాపారావు, సుగణాకర్, తాతారావు పాల్గొన్నారు.

108 వాహన పైలెట్‌కు సన్మానం



చిరంజీవి దంపతులను సన్మానిస్తున్న శ్రీరామమూర్తి

నందిగాం: మండలంలో సుమారు 17 ఏళ్లు 108 వాహన పైలెట్‌గా పని చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడిన సర్లాన చిరంజీవి సేవలు మరువలేనివని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. చిరంజీవి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని స్థానిక 108 కార్యాలయం వద్ద ఆదివారం ఆ శాఖ ఉద్యోగులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ శ్రీరామమూర్తి.. చిరంజీవి దంపతులను దుశ్శాలువలతో సత్కరించి సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జడ్యాడ జయరాం, జడ్ఎం నజీర్, వోణ రంగప్రసాద్, ఫ్లీట్ మేనేజర్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం..



కంచిలి మండల కేంద్రంలోని బలియాపుట్టుగ కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇల్లు కాలిపోయి నష్టపోయిన కుటుంబానికి పోలీసులు అండగా నిలిచి ఔదార్యాన్ని చాటుకున్నారు. మూడు బస్తాల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు, 13 జతల నూతన వస్త్రాలను సోంపేట సీఐ బి.మంగరాజు, స్థానిక ఎస్సై పి.పారినాయుడు చేతులమీదుగా ఆదివారం అందజేశారు. అలాగే టీడీపీ నాయకులు జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, కొర్రాయి కురయ్యలు బాధిత కుటుంబానికి రూ.7 వేలు సాయం అందించారు. –కంచిలి

లోకబాంధవ శతకం ఆవిష్కరణ



ప్రముఖ విద్వాన్ పైడి హరనాథరావు రచించిన లోక బాంధవ శతకం సామాన్యుడికి సైతం అర్థమవుతుందని వక్తలు ఎం.జగన్నాథరావు, జి.వి.రెడ్డి మాస్టార్, ఎస్.నారాయణ మూర్తి అన్నారు. లోక బాంధవ శతక గ్రంథాన్ని సాహిత్య సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక పెన్షనర్స్ భవనంలో ఆదివారం ఆవిష్కరించారు. గ్రంథం విశిష్టతను వక్తలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రచయిత హరనాథరావు దంపతులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఆర్.రామచంద్రరావు, పి.ఢిల్లేశు, ఎం.గణపతిరావు, హెచ్.నాగేశ్వరరావు, బి.అయ్యబాబు, కె.కామేశ్వరరావు, ఆర్.విజయకుమారి, ఎ.ప్రకాశరావు, ఎస్.రాంబాబు, చిలుకు కృష్ణారావు, ప్రధాన హరిశ్చంద్రరావు పాల్గొన్నారు. –టెక్కలి

పాఠశాలల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాసలోని తన కార్యాలయంలో ఆదివారం రాత్రి పలాస నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయడంతోపాటు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలు ఇక నుంచి ఉండబోవని, ఈ విషయాన్ని గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు క్షుణ్ణంగా వివరించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, అధికారులపై ఉందన్నారు. సమావేశంలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల విద్యాశాఖాధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, బోడ వెంకటరమణ, డి.దాశరథి, ఎం.లక్ష్మణరావు, ఎస్.తారకేశ్వరరావు ఉన్నారు.

పోరాట యోధులను స్మరించుకుందాం



పలాస: పోరాటయోధుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



కాశీబుగ్గలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

పలాస: స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన యోధులను స్మరించుకుందామని వక్తలు అన్నారు. పలాస మండలం పెద్దమాకన్నపల్లి గ్రామంలో స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భగా పోరాట యోధుల విగ్రహాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. పీడీఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మూఢనమ్మకాల నిర్మూలన సంఘం శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పాతజాతీయ రహదారి వద్ద పోరాట యోధుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గీతారాణి మాట్లాడుతూ.. యువతలో విద్యుత్ ప్రవాహములా దేశభక్తిని రగిలించిన గొప్ప దేశభక్తులు భగత్‌సింగ్ అని కొనియాడారు. కుమారి నాట్య చందు భగత్‌సింగ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, బోకర దుర్యోధన, మామిడి కోదండరావు, కొర్లాన ఉమాపతి, కుత్తుము లోకనాథం, మార్పు వందన, జగన్‌మోహన్‌రావు, సార సోమేశ్వరరావు పాల్గొన్నారు.

26న పలాసలో జాబ్‌మేళా

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని స్త్రీశక్తి భవనంలో ఈనెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫ్యూషన్ ఫైనాన్స్, బ్లూస్టార్, యూనిఫార్మ్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. సుమారు 180 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారన్నారు. ఎనిమిది నుంచి డిగ్రీ వరకూ చదివి.. 34 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. వివరాల కోసం 87126 55686, 81065 08318 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉల్లాస్‌ంగా పరీక్ష రాశారు!



కంచిలి: సిర్తలిలో పరీక్ష రాస్తున్న వారితో మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి



మందసలో పరీక్ష రాస్తున్న వయోజకులు



కవిటి: కరాపాడు పంచాయతీలో పరీక్ష రాస్తున్న మహిళా సంఘాల సభ్యులు



ఇచ్ఛాపురం రూరల్: పాయితారిలో పరీక్ష రాస్తున్న వయోజనులు

కంచిలి: వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ సార్వత్రిక విద్యా పీఠం (ఉల్లాస్) పథకం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చిన నేపథ్యంలో వారికి పరీక్షలను ఆదివారం నిర్వహించారు. 15 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న వారు ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో భాగంగా సిర్తలి పరీక్ష కేంద్రాన్ని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పరిశీలించారు. పరీక్షలకు హాజరైన వారితో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. చదువు వలన కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. ఐకేపీ ఏపీఎం అప్పలనరసమ్మ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 44 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి.

మందస: మందస మండలంలో కూడా ఉల్లాస్ పరీక్షలు జరిగాయి. ఐసీడీఎస్ సీఎఫ్ నాగమణి పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

కవిటి: మండలంలోని 58 కేంద్రాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉల్లాస్ పరీక్షలు జరిగాయి. ఏపీఎం కె.గోవింద్ పర్యవేక్షించారు. మండలంలో 2046 మంది అభ్యాసకులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. 1884 మంది హాజరయ్యారు. చదవడం, రాయడం, గణిత విభాగాలపై నిర్వహించిన పరీక్షలో పాసైన వారికి మూడో తరగతి సర్టిఫికెట్ అందజేస్తారు.

ఇచ్ఛాపురం రూరల్: వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉల్లాస్ పరీక్షకు మండలంలో 1222 మంది హాజరయ్యారని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు తెలిపారు. 21 పంచాయతీల్లో జరిగిన పరీక్షలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, వీవోఏలు ఇన్విజలేటర్లుగా వ్యవహరించారు.

సోంపేట: మండలంలో జరిగిన ఉల్లాస్ పరీక్షలకు 68 మంది గైర్హాజరయ్యారు. 57 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 575 మంది హాజరు కావాల్సి ఉండగా 68 మంది గైర్హాజరయ్యారు. ఎంపీడీవో సి.హెచ్.ఈశ్వరమ్మ, ఏపీఎం రమణమ్మ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

వజ్రపుకొత్తూరు: మండల వ్యాప్తంగా ఉల్లాస్ పరీక్షలు జరిగాయి. వెలుగు సీఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు కేంద్రాలను పరిశీలించారు.